

## చాపరాయిలో పర్యాటకుల సందడి

**ప్రజాశక్తి-డుంబ్రిగుడ:** మండలంలోని పర్యాటక కేంద్రమైన చాపరాయి జలపాతంలో ఆదివారం అధిక సంఖ్యలో పర్యాటకులు పోటెత్తారు. పర్యాటకుల తాకిడితో చాపరాయి జలపాతంలో పర్యాటకుల ఆటపాటలతో సందడి వాతావరణం నెలకొంది. జలపాతంలో జారుతూ స్థానాలు చేస్తూ ఆనందంగా గడిపారు. అంజోడా సిల్క్ ఫారం, కోల్లపుట్టు జలతరంగిని పర్యాటక ప్రదేశాల్లో కూడా పర్యాటకులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. పర్యాటకుల తాకిడితో సందడి వాతావరణం నెలకొంది.



చాపరాయి వద్ద పర్యాటకులు

## పాడేరులో నిరుపయోగంగా ..

# పాత బస్ షెల్టర్, రైతు బజార్

### -అభివృద్ధి చేయాలని ప్రయాణికులు, రైతుల అభ్యర్ధన

**ప్రజాశక్తి-పాడేరు:** జిల్లా కేంద్రం పాడేరులోని పాత బస్టాండ్ సెంటర్లో బస్ షెల్టర్ శిథిలావస్థలో ఉండటంతో నిరుపయోగంగా ఉంది. అభివృద్ధికి నోచుకోక ఇక్కడ ఉన్న బస్సు షెల్టర్ ప్రాంగణ మంతా వ్యాపారస్తుల దుకాణాలతో నిండిపోయింది. దీంతో ప్రయాణికులకు అక్కరకు రాక బస్సు షెల్టర్ మరుగున పడిపోయింది.

**ఇదొక ప్రధాన కూడలి..**

గతంలో ఇక్కడే ఆర్టీసీ బస్ డిపో మరియు కాంప్లెక్స్ నిర్వహించిన ప్రదేశమిది. ఈ పాత బస్టాండ్ చుట్టుపక్కల ఉన్న వీధులు, గ్రామాల ప్రజలు ఇక్కడే బస్సు ఎక్కుతుంటారు. వందలాది మంది ప్రయాణికులు ఇక్కడి నుంచే ఇతర ప్రాంతాలకు వెళ్లి రావడానికి రాకపోకలు సాగిస్తుంటారు. విశాఖపట్నం, చోడవరం, అనకాపల్లి, రాజమండ్రి వంటి మైదాన ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు ఇక్కడే బస్సు ఎక్కుతారు. కొయ్యూరు సీలేరు, జికె వీధి, చింతపల్లి, జిమాడుగుల, ఇతర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు కూడా బస్సు ఎక్కడానికి ఇక్కడ నుంచే బయలుదేరుతారు. మూడు రోడ్ల కూడలి ఈ పాత బస్టాండ్ పాడేరులో ప్రయాణికులకు ముఖ్య కూడలి ప్రదేశంగా ఉంది. బసు షెల్టర్ ను ప్రయాణికుల సౌలభ్యం కోసం యూనియన్ బ్యాంకు వారు నిర్మించారు. ఎన్నో ఏళ్ళు ఈ బస్సు షెల్టర్ వినియోగంలో ఉండి ప్రయాణికులకు ఎంతో ఉపయోగకరంగా ఉండేది. కాలక్రమేణ ఈ ప్రాంగణం అభివృద్ధికి నోచుకోక ఆక్రమణలకు గురై నిరుపయోగంగా మారింది.

మైదాన ప్రాంతాలకు వెళ్లే బస్సులు నిలపడానికి బస్ షెల్టర్ ముందు అవసరమైన స్థలం ఉంది. ఈ పాత బస్టాండ్ ఆవరణలో రోజు ఉదయం నుంచి రాత్రి వరకు వందలాదిగా ప్రయాణికులు బస్సు ఎక్కి దిగుతుంటారు. వీరు కనీసం నిలుచోవడానికి కూడా స్థలం లేదు. వర్షం పడితే ఏ దుకాణంలోనూ దూరి తలదాచు కోవలసిన పరిస్థితి ఉంది.



నిరుపయోగంగా ఉన్న బస్ షెల్టర్



నిరుపయోగంగా ఉన్న రైతు బజార్

**రైతు బజార్ దుస్థితి.....**

పాడేరు పట్టణం నడిబొడ్డున ఉన్న రైతు బజార్ కూడా నిరుపయోగంగా ఉంది. ఇందులో దుకాణ సముదాయం కూడా నిర్మించారు. వీటిని సరైన రీతిలో వ్యాపారులకు కేటాయించి అప్పగించక పోవడం దీన్ని నిర్వహణ పూర్తిగా వదిలేయడంతో రైతు బజార్ అధ్వాన్నంగా మారింది. దీనికి తోడు అసాంఘిక కార్యకలాపాలకు వేదికయ్యింది. రైతులకు వ్యాపారులకు చెందకుండా లక్షలాది రూపాయలతో నిర్మించిన ఈ రైతు బజార్ పాత బస్టాండ్ ఆవరణలో ఒక శిథిల ప్రాంగణంగా మిగిలింది. జిల్లా కేంద్రమైన పాడేరులో ఈ రైతు బజార్ ప్రాంగణం ఎంతో విలువైన ప్రదేశం. ఎక్కడ ఏ రకమైన అభివృద్ధి జరిగినా ప్రజలకు ఎంతో ఉపయోగంగా ఉంటుంది. దీనిపై అధికారులు చొరవ తీసుకొని దృష్టి సారించాల్సి ఉంది. పాడేరు జిల్లా కేంద్రంగా అవతరించిన తర్వాత ఒకవైపు ట్రాఫిక్ సమస్య ఎంతో పెరిగింది. రోడ్లపైనే దుకాణాలు, ఆటోలు, వాహనాలు నిలుపుకునే తలాభావం వంటి ఎన్నో సమస్యలు ఉన్నాయి. దీనిని దృష్టిలో పెట్టుకొని అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, స్పందించి పాత బస్టాండ్ ఆవరణ లోని బస్సు షెల్టర్ ను రైతు బజార్ ప్రాంగణాన్ని అభివృద్ధి చేసి అటు రైతులకు, వినియోగదారులకు వ్యాపారులకు ఇటు ప్రయాణికులకు సౌలభ్యం చేకూరే విధంగా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

## నేడు ఐక్య క్రిస్మస్ వేడుకలు

**ప్రజాశక్తి-హుకుంపేట:** యునైటెడ్ ఫాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో ఈనెల 11న ఐక్య క్రిస్మస్ నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఫెలోషిప్ అధ్యక్షులు కార్యదర్శులు వి.మోజెష్ కె.జేమ్స్, సంఘ సభ్యులు కలిసి ఆదివారం పోస్టర్ను విడుదల చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ, మండలంలో 33 పంచాయతీల పాస్టర్ల సంఘ సభ్యులు అందరూ హాజరు కావాలని కోరారు. పట్టం పంచాయతీ కుమ్మరిపుట్టు గ్రామంలో మండల పాస్టర్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో ఐక్య క్రిస్మస్ను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా క్రీస్తుకు సంబంధించిన ఆధ్యాత్మిక సందేశాలు, ప్రత్యేక గీతాలు ఉంటాయని తెలిపారు. ఈ వేడుకలకు హాజరై ఆత్మీయంగా మేలులు పొందాలని వారు కోరారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఫెలోషిప్ అధ్యక్షులు

## ఛత్తీస్‌గఢ్‌లో గ్రామస్తుని దారుణహత్య

### గొడ్డలితో నరికి చంపేసిన మావోయిస్టులు



కూంబింగ్ చేస్తున్న సాయుధ పోలీసులు

**ప్రజాశక్తి- చింతూరు :** ఛత్తీస్‌గఢ్ నారాయణ్‌పూర్ జిల్లా చోతేదోంగర్ గ్రామస్తుడిని శనివారం సాయంత్రం మావోయిస్టులు గొడ్డలితో నరికి చంపారు. మృతుడు చోతేదోంగర్ గ్రామంలో పేరు పొందిన నాటువైద్యుని మేనల్లుడు కోమల్ మాంఝిగా పోలీస్‌లు గుర్తించారు. తన మేనమామతో కలిసి ఆలయంలో పూజలు చేసి ఇంటికి వస్తుండగా మావోయిస్టుల ఈ ఘాతుకానికి పాల్పడ్డారు.

గతంలో వీరిద్దరిని చంపుతామని మావోయిస్టులు నుంచి బెదిరింపులు కూడా వచ్చాయని సీనియర్ పోలీస్ అధికారి తెలిపారు. ఇటీవల అసెంబ్లీ ఎన్నికల సమయంలో జిల్లాలోని మారుమూల ప్రాంతాలకు చెందిన కొంతమందిని నారాయణ్‌పూర్ జిల్లా కేంద్రానికి తరలించి భద్రత కల్పించారు. వారిలో వీరిద్దరూ ఉన్నారు. ఎన్నికలు ముగిసిన తర్వాత గ్రామానికి తిరిగొచ్చిన వీరిద్దరూ, తమకు రక్షణ అక్కరలేదని తిరస్కరించారని పోలీస్ అధికారి వెల్లడించారు.

మాంఝి హత్య సమాచారం అందగానే సంఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు, మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించారు. సంఘటనాస్థలిలో మావోయిస్టులు చేతిరాతతో ఒక లేఖను విడిచిపెట్టారు. మాంఝి,అందాయి ఘాటీ ఇద్దరు ఇనుప ఖనిజం గని ఏజెంటుగా పని చేస్తూ, భారీగా డబ్బు సంపాదిస్తున్నాడని, అందుకే అతనిని మట్టుబెట్టినట్లు లేఖలో పేర్కొన్నారు. మావోయిస్టుల కోసం ఆ ప్రాంతంలో పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.

## మెగా డిఎస్‌సి వెంటనే ప్రకటించాలి

**ప్రజాశక్తి -రంపచోడవరం :** ముఖ్యమంత్రి జగన్ ఎన్నికల ముందు పాదయాత్రలో నిరుద్యోగులకు ఇచ్చిన హామీ మేరకు మెగా డిఎస్‌సిని వెంటనే ప్రకటించాలని ఆదివాసి జెఎసి రాష్ట్ర వైస్ చైర్మన్ తెల్లం శేఖర్ డిమాండ్ చేశారు. ఆదివారం దేవీపట్నం మండలం ఇందుకూరుపేట గ్రామంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ, ఏటా జనవరిలో జాబ్ క్యాలెండర్ విడుదల చేసి ఉద్యోగ నియామకాలు చేపడతామని, మెగా డిఎస్‌సి ప్రకటించి ఏజెన్సీలో ఉద్యోగాల నియామకాలు చేపడతామని హామీ ఇచ్చారని, నాలుగున్నరేళ్లు గడిచినా వాటిని అమలు చేయలేదన్నారు. దీంతో ఏజెన్సీలో అనేక పాఠశాలలు ఏకోపాధ్యాయులతో నడుస్తున్నాయని, దీంతో ఆయాపాఠశాలల్లోని ఉపాధ్యాయులు ప్రభుత్వ యాప్‌లను అప్‌లోడ్ చేయాడానికే సమయం సరిపోతుందన్నారు. యాప్‌లతో ఆదివాసీ విద్యార్థులకు గుణాత్మక విద్యను అందించలేక పోతున్నరన్నారు. యాప్‌లలో వివరాలను అప్‌లోడ్ చేయడానికి ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటు చేయాలన్నారు. ఆదివాసీ జెఎసి రాష్ట్ర కార్యదర్శి కారం రామన్నదొర మాట్లాడుతూ ఏజెన్సీ రంపచోడవరం కేంద్రంగా వైద్య, న్యాయకళాశాలలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే గ్రూప్ 2 నోటిఫికేషన్ వచ్చింది. కావున గ్రూప్ 2, పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగాలకు అప్లై చేసిన ఆదివాసి అభ్యర్థులకు రంపచోడవరం కేంద్రంగా గ్రూప్ 2 మరియు పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఉచిత కోచింగ్ సెంటర్ ఏర్పాటు చేయాలని కోరారు.

## తుపాన్ బాధిత రైతులను ఆదుకోవాలని

# నేడు అఖిలపక్షం ఆందోళన



సమావేశమైన అఖిలపక్ష పార్టీల నేతలు

**ప్రజాశక్తి -సీలేరు:** తుపాన్‌తో పంటలు నష్టపోయిన బాధిత రైతులను ఆదుకోవాలని ఈనెల 11న సోమవారం అఖిలపక్షాల నాయకులు ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టన్నున్నట్లు సిపిఎం మండల కార్యదర్శి గాలికొండ ఎంపిటిసి ఎ.బుజ్జిబాబు తెలిపారు. ఆదివారం సమావేశమైన అఖిలపక్ష నేతలు మాట్లాడుతూ, మండలంలోని 16 పంచాయతీల్లో ఇటీవల తుఫాన్‌కు పంటలు కోల్పోయిన రైతులు ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. పొలాల్లో నీరు చేరడం వల్ల వరి,మినప, చోడి, రాజ్మా, అలుసులు తదితర పంటలు పూర్తిగా పాడయ్యాయన్నారు. రైతులకు జరిగిన నష్టాన్ని అఖిలపక్షాల ఆధ్వర్యంలో అధికారులకు తెలియజేసేందుకే ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలోబాధిత రైతులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. పంటలు నష్టపోయిన రైతులకుప్రభుత్వం తక్షణమే పరిహారం చెల్లించాలని, పంట రుణాల మాఫీ, ఇన్‌పుట్ సబ్సిడీ అందజేత, ప్రత్యామ్నాయ పంటలకు ఉచితంగా విత్తనాల పంపిణీ, మిగిలి ఉన్న పంటను కొర్రీలు పెట్టకుండా ప్రభుత్వమే మద్దతుధరనిచ్చి కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.కార్యక్రమంలో వివిధ పార్టీలకు చెందిన అఖిలపక్ష నాయకులు పాల్గొన్నారు.

## 14, 16 తేదీల్లో వైసిపి వాహనయాత్ర



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వైసిపి నేతలు

**ప్రజాశక్తి- రాజవొమ్మంగి :** నాలుగున్నరేళ్లలో వైసిపి ప్రభుత్వం అమలు చేసి న అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించడానికి ఈనెల 14,16 తేదీల్లో నియోజకవర్గంలో రంపచోడవరం ఎమ్మెల్యే నాగులాపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంత ఉదయ్‌భాస్కర్ ఆధ్వర్యంలో వైయస్సార్ వాహన యాత్ర రోడ్‌షో చేపట్టనున్నట్లు సొసైటీ అధ్యక్షులు వైసిపి మండల కన్వీనర్ సింగరెడ్డి రామకృష్ణ తెలిపారు. ఆదివారం ఆర్ అండ్‌బి అతిథి గృహం వద్ద వాహనయాత్ర రోడ్డు షోకు సంబంధించి వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈనెల 14న ఒట్టిగడ్డ నుండి ప్రారంభమైన రోడ్డుషో రాజవొమ్మంగి,శరభవరం,కింద్ర మీదుగా లబ్బర్తి వరకు సాగుతుందని, అలాగే ఈనెల 16న బలిజపాడు నుండి ప్రారంభమై వంచంగి, కొమరాపురం, అమీనాబాద్ మీదుగా జడ్డంగి వరకు సాగుతుందని తెలిపారు,కార్యక్రమంలో ఎమ్మెల్సీ అనంత బాబు ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి పాల్గొంటారన్నారు. వైసీపీ నాయకులు,కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు,మండల ప్రజలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపిపి గోము వెంకటలక్ష్మి, జడ్పిటిసి ఒడుగుల జ్యోతి,వైస్ ఎంపీపీ చప్పా చంద్రరాణి, ఎంపిటిసి కనిగిరి గంగాధర, సర్పంచుల సమాఖ్య అధ్యక్షులు కొంగర మురళీకృష్ణ, పలువురు సర్పంచులు, ఎంపీటీసీలు వైసిపి శ్రేణులు పాల్గొన్నారు.

## తాగునీటి బోరు ఏర్పాటు

**ప్రజాశక్తి-అరకులోయరూరల్:** ఇంటింటికి మంచినీరు అందించాలని ఉద్దేశంతో కేంద్రం ప్రభుత్వం జల జీవన్ మిషన్ పథకం ప్రారంభించారు. దీనిలో భాగంగా మండలంలోని లోతేరు పంచాయతీ మారుమూల గ్రామాలైన తోడుబంధ, కురిసేల, కిక్కిటిగూడ గ్రామాలలోని సర్పంచ్, ఎంపీటీసీ చొరవతో ఆదివారం సుమారు ఏడు లక్షల నిధులతో సోలార్ తాగునీటి బోరు వేయించారు. ఈ సందర్భంగా లోతేరు సర్పంచ్ జి కళావతి, ఎంపిటిసి కె.రాములమ్మ మాట్లాడుతూ, ఈ తాగునీటి బోరును సద్వినియోగం చేసు కోవాలని వారు సూచించారు.ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు జి.శ్రీరాములు, కిల్లో నోబో, వార్డు మెంబెర్ నాగేష్, జగన్నాధం, రామారావు, రామూర్తి, గ్రామ పెద్దలు భీమా, త్రినాధ్, కామరాజు, తదితరులు పాల్గొన్నారు.



బోరును ఏర్పాటు చేస్తున్న నేతలు

## అనారోగ్యంతో ఆవు మృతి

### - పాడి రైతుకు ఆర్థికంగా తీవ్ర నష్టం- ఆదుకోవాలని వినతి

**ప్రజాశక్తి-డుంబ్రిగుడ:** మండలంలోని పోతంగి పంచాయతీ బల్లుగూడలోని ఎస్.అప్పారావుకు చెందిన ఆవు గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం మృతి చెందినట్లు బాధిత రైతు స్థానిక విలేకరుల వద్ద వాపోయాడు. ఆవు అనారోగ్యంతో బాధ పడు తున్నట్లు సంబంధిత సచివాలయంలో ఏహెచ్‌ఏకు పలుమార్లు చెప్పడం జరిగిందన్నారు. సకాలంలో వైద్య సేవలు అందించక పోవడంతో పరిస్థితి విషమించి మృతి చెందిందని బాదిత గిరిజనుడు అప్పారావు ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో, ఆర్థికంగా తీవ్రంగా నష్టపోయాయని తెలిపాడు. అధికారులు స్పందించి ఆర్థిక సాయం చేసి ఆదుకోవాలని బాదిత గిరిజనుడు కోరుతున్నారు.



ఆవేదన వ్యక్తం చేస్తున్న రైతు

## ఉద్యోగుల వేతనాలు చెల్లించాలి

**ప్రజాశక్తి-డుంబ్రిగుడ:** ప్రభుత్వ ఉద్యోగుల వేతనాలను ప్రతినెలా సకాలంలో వెంటనే చెల్లించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా కన్వీనర్ సుజాత సాల్మాన్ డిమాండ్ చేశారు. ఆదివారం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, ప్రభుత్వ ఉద్యోగులకు సకాలంలో వేతనాలు అందక పోవడంతో బ్యాంకు రుణాలు, బయట ఫైనాన్స్‌తో రుణాలు, వాహనాలు తీసుకున్న ఉద్యోగస్తులు నెలవారీగా చెల్లించే ఈఎంఐలు కట్టలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. దీంతో పాటు పిల్లల చదువులకు సంబంధించిన ఫీజులను కూడా చెల్లించుకోలేని పరిస్థితుల్లో మనోవేదనకు గురవుతున్నారని చెప్పారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి సకాలంలో ప్రభుత్వ ఉద్యోగస్తులకు వేతనాలు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## 14, 15 తేదీల్లో ఆశా వర్కర్ల సమస్యలపై

# 36 గంటల మహా ధర్నా

### జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి వెంకట్ పిలుపు



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సిఐటియు జిల్లా కార్యదర్శి వెంకట్, ఆశావర్కర్లు

**ప్రజాశక్తి-చింతూరు:** ఆశావర్కర్ల సమస్యల పరిష్కారానికి ఈనెల 14,15 తేదల్లో 36గంటల మహాధర్నా వంటావార్పు నిరసన చేపట్టనున్నట్లు ఆశావర్కర్ల యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యురాలు రవ్వ వీరమ్మ, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లపు వెంకట్ తెలిపారు. ఆదివారం నాలుగు విలీన మండలాల్లోని ఆశావర్కర్లు, పిహెచ్‌సిల లీడర్లతో వీరమ్మ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ ఆశావర్కర్లకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, పనిభారాన్ని తగ్గించాలని, ఆన్‌లైన్ లేదా రికార్డులను ఏదైనా ఒకపనిని ఒకసారి మాత్రమే చేయించాలని, మొబైల్ వర్క్‌లపై శిక్షణ ఇవ్వాలని, ప్రభుత్వ సెలవులు, మెడికల్, మెటర్నటి లీవ్స్ వర్తింపజేయాలని, పిహెచ్‌సికి పిలిపించిన ప్రతి సందర్భంలోనూ టిఎ, డిఎలు ఇవ్వాలని. రూ.10 లక్షలు గ్రూప్ ఇన్సూరెన్స్, రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇతర సౌకర్యాలను కల్పించాలని కోరారు. తమ డిమాండ్ల సాధనకు రాష్ట్రకమిటీ పిలుపుమేరకు ఈనెల 14 15 తేదీల్లో కలెక్టరేట్‌ల 36 గంటల మహాధర్నా, వంటా వార్పుఆందోళనలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత ఆశావర్కర్లపై పనిభారం పెరిగిందని, 24గంటలు వెట్టిచాకిరీ చేయించుకుంటూ కేవలం రూ.పది వేల వేతనాన్ని మాత్రమే ఇస్తున్నారని, వేధింపులు, బెదిరింపులకు గురిచేస్తున్నారన్నారు. ఎటువంటి శిక్షణనివ్వకుండా 14రకాల యాప్‌లతో మొబైల్ పనులు చేయిస్తున్నారన్నారు. గ్రామీణ ఏజెన్సీ ప్రాంతాల్లో మొబైల్ నెట్‌వర్క్ లేకపోయినా ఫోన్లు పనిచేయకపోయినా ఆశ వర్కర్‌లనే బాధ్యుల్ని చేయడం దుర్మార్గమన్నారు. ప్రభుత్వం ఇచ్చిన మొబైల్ ఫోన్లు పనిచేయకుంటే సొంత ఫోన్లలో పనిచేయాలని బెదిరింపులు నిత్యకృత్యంగా మారాయని ఆరోపించారు. ఆన్‌లైన్‌లో 14 యాప్‌లతో పనిచేయించడం తోపాటు ఆఫ్‌లైన్‌లో 26 రకాల రికార్డ్స్ రాయాలని హింసిస్తున్నారని, ప్రతిరోజు రిజిస్టర్లలో సంతకాలు చేయాలని, హెల్త్ క్లినిక్ వలయాల్లో రోజంతా కూర్చోవాలని, మిగిలిన సమయంలో ఫీల్డ్‌వర్క్ చేయాలని. తీవ్ర ఒత్తిడికి గురిచేయడం దారుణమన్నారు. దీంతో ఒత్తిడిని తట్టుకోలేని కొందరు ఆశావర్కర్లు గుండెపోటు, ఇతరత్రా అనారోగ్య సమస్యలకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ఆశాల సమస్యల పరిష్కారానికి ఈనెల 14. 15 తేదీల్లో చింతూరు ఐటిడిఎ కార్యాలయం వద్ద నిర్వహించే 36 గంటల ధర్నా, వంటవార్పు ఆందోళనలో విలీన నాలుగు మండలాల్లోని ఆశ వర్కర్స్ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో చింతూరు సిఐటియు మండల కార్యదర్శి పొడియం లక్ష్మణ్, సిఐటియూ మండల కమిటీ సభ్యులు బి దిలీప్, నాలుగు మండలాల ఆశావర్కర్ల పిహెచ్ లీడర్లు మడకం శ్రీదేవి. నూతన సుజాత, ఉష, దుర్గ, కవితచ, లక్ష్మి, ముత్తమ్మ, సుబ్బలక్ష్మి. పాల్గొన్నారు.

# పంట నష్టాలకు పరిహారమిచ్చి ఆదుకోండి

### ప్రభుత్వానికి సిపిఎం మండల కమిటీ డిమాండ్

**ప్రజాశక్తి-కూనవరం :** మిచౌంగ్ తుపాన్ ప్రభావంతో పంటలు నష్టపోయిన రైతులుకు మీనమేషాలు లెక్కించకుండా తక్షణమే నష్టపరిహారం అందించి ఆదుకోవాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు మేకల నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని శ్రీమార్తా శ్రీరామ్మూర్తి భ లో కొమరం పెంటయ్య అధ్యక్షతన జరిగిన సిపిఎ మండల కమిటీ సమావేశంలో మాట్లాడుతూ తుపాన్ బాధిత రైతులను ఆదుకోవడంలో కేంద్ర రాష్ట్రప్రభుత్వాలు తీవ్ర నిర్లక్ష్యం చేయడం దుర్మార్గమన్నారు. విలీన మండలాలు, అందులోని బాధిత ప్రజలు, రైతులంటే తాజా, మాజీ ప్రభుత్వాలకు చులకన భావం ఉండడం దారుణమన్నారు. కూనవరంలో జూన్, జులై నెలల్లో పోలవరం బ్యాక్ వాటర్‌తో పంటలన్నీ మునిగిపోతున్నాయని, ఆ తర్వాత సెప్టెంబర్,అక్టోబర్ నెలల్లో వర్షాభావంతో ఎండి, ఇపుడేమే తుపాన్ దెబ్బకు ముంపు బారిన పడి తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పంట నష్ట పోయిన రైతులందరికీ తక్షణమే తగిన నష్టపరిహారం అందించి ఆదుకోవాలని కోరారు. బాధిత రైతుల పక్షాల సిపిఎం ఎపుడూ అండగా ఉండి పోరాటం చేస్తుందని భరోసానిచ్చారు కార్యక్రమంలో మండల కార్యదర్శి పాయం సీతారామయ్య, టి.శ్రీనివాసరావు, బాబు, బొర్రయ్య, బి.సుబ్బయ్య, సర్పంచ్‌లు బి.రామారావు, ఎం నాగమణి, సొడే శంకర్, బి. వెంకమ్మ, ఎంపిటిసి కె.జయసుధ వెంకన్నబాబు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిపిఎం నేత నాగేశ్వరరావు



భోజనాన్ని ఏర్పాటుచేసిన సంఘం ప్రతినిధులు

## ఘనంగా మానవ హక్కుల దినోత్సవం

**ప్రజాశక్తి-డుంబ్రిగుడ:** వరల్డ్ హ్యూమన్ రైట్స్ డే వేడుకలను మండలంలో ఇండో హ్యూమన్స్ రైట్స్ సొసైటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అరకులోని టచ్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించే అనాధ శరణాలయంలో 30 మంది విద్యార్థులకు ఉచితంగా మధ్యాహ్నం భోజన సౌకర్యం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు బి.డేవిడ్, అరకులోయ, డుంబ్రిగూడ మండల అధ్యక్షుడు బి.లక్ష్మణ్ ఏం గాసి తదితరులు పాల్గొన్నారు.

## రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

**ప్రజాశక్తి-నక్కపల్లి:**తుఫాన్ ప్రభావంతో నష్ట పోయిన రైతాంగాన్ని ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని మాజీ ఎమ్మెల్యే వంగలపూడి అనిత డిమాండ్ చేశారు. మండలంలోని జి.జగన్నాధపురం లో తుఫాను ప్రభావంతో ముంపునకు గురై దెబ్బతిన్న వరి పొలాలను పరిశీలించారు. పంట చేతికందే సమయంలో తుఫాన్ ప్రభావంతో కురిసిన వర్షానికి వరి పంట పూర్తిగా దెబ్బతినడంతో తీవ్రంగా నష్టపోయామని పలువురు రైతులు అనిత ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు కష్టాలు వింటుంటే చాలా బాధనిపిస్తుందని, ఇలాంటి సమయంలో అండగా ఉండాల్సిన ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల శాఖ అధ్యక్షులు కొప్పిశెట్టి వెంకటేష్, నాయకులకు కొప్పిశెట్టి బుజ్జి, నానేపల్లి రాఘవులు తదితరులు పాల్గొన్నారు.

## ట్రాఫిక్‌తో సతమతం

**ప్రజాశక్తి- కోటవురట్ల:**మండల కేంద్రంలో ప్రధాన రహదారిని అనుకుని పలు దుకాణ సముదాయాల వద్ద ఇష్టారాజ్యంగా వాహనాలను పార్కింగ్ చేయడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. దీంతో, పాదచారులు, వాహనదారుల తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని సందర్భాలలో ప్రమాదాలు సైతం చోటు చేసుకుంటున్నా పంచాయతీ, పోలీస్ అధికారులు పట్టించుకోలేదని పలువురు వాహనదారులు ఆరోపించారు.దీనికి తోడు అక్రమంగా ఏర్పాటు చేసిన పలు దుకాణాల వద్ద మరింత ఇబ్బంది పడాల్సిన పరిస్థితి నెలకొంది. అధికారులు ఇప్పటికైనా స్పందించి ట్రాఫిక్ సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.

## తుపాను బాధితులకు సహాయం

**ప్రజాశక్తి-యస్.రాయవరం:** ఇటీవల తుఫాన్ కి మండలంలో దార్లపూడి గ్రామంలో నివసిస్తున్న బంగారు నూకరాజు ఇల్లు పూర్తిగా ధ్వంసం కావడంతో సహాయం అందించినట్టు సమతా సైనిక్ దళ్ ట్రైమ్ అధ్యక్షులు గారా ప్రకాష్ తెలిపారు. ఈ సందర్భంగా ప్రకాష్ మాట్లాడుతూ, దార్లపూడి శివారు ప్రాంతంలో నివశిస్తున్న బంగారు నూకరాజు కుటుంబాన్ని ఆదివారం జడ్పిటిసి కాకర్ల దేవి కలిసి మనోధైర్యం చెప్పి కుటుంబానికి బియ్యం, కూరగాయలు, కొంత నగదు సహాయం చేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనరల్ సెక్రటరీ బిక్కవోలు విజయ్, అప్పారావు, ఎంపీటీసీ బైపా శ్రీను, రాజు, మోహన్ పాల్గొన్నారు.

## రోడ్డుపై గోతులు పూడ్చివేత

**ప్రజాశక్తి-రోలుగుంట:**రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా తహశీల్దార్ కార్యాలయం వద్ద గుంతలమయంగా మారిన రోడ్డును పోలీసులు పూడ్చి వేయించారు. కొత్తకోట సిఐ సయ్యద్ ఇలియాస్ మహమ్మద్ ఆధ్వర్యంలో రోలుగుంట ఎస్సై సురేష్ తన సిబ్బందితో కలిసి ఈ రోడ్డుపై ఉన్న గుంతలను పూడ్పించారు. అలాగే రోడ్డుకు ఇరువైపులా ఉన్న తుప్పలను తొలగించారు.



చెత్తా చెదారంతో ఉన్న బస్ స్టాప్

# డంపింగ్ యార్డుగా అరకు బస్‌స్టాప్

### ఇబ్బంది పడుతున్న ప్రయాణికులు

**ప్రజాశక్తి-డుంబ్రిగుడ:** ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే ప్రయాణికుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన మండలంలోని అరకు సంత బయలులోని బస్ స్టాప్ డంపింగ్ యార్డుగా మారింది. బస్ స్టాప్ వెనుకన బీరు సీసాలు, మందు బాటిళ్ళు కుప్పలు కుప్పలుగా పడుస్తున్నారు. ఆర్టిసి బస్సులో ప్రయాణించే ప్రయాణికులకు ఈ బస్ స్టాప్ ను నిర్మించారు. బస్ స్టాప్‌కు ఆనుకుని వైన్ షాపు ఉండడంతో మద్యం సేవించే వారంతా బస్ స్టాప్ పక్కనే మద్యం సేవించి బాటిళ్లను బస్ స్టాప్ వెనుక భాగంలో పడేస్తున్నారు. దీంతో, మద్యం బాటిల్లు పేరుకుపోయి ఉన్నాయి. ప్రతి శుక్రవారం ఇక్కడ వారపు సంత జరుగుతుంది. సంతలోని చెత్తను చిందర వందరగా బస్ స్టాప్ వద్ద దర్శనం ఇస్తోంది. దీంతో, పాదచారులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. వర్షాలు కురిసినప్పుడు అందులో వర్షపు నీరు నిలువ ఉండిపోతుండటంతో దోమలు వ్యాప్తి చెందుతున్నాయి.

# చట్టాలపై అవగాహన

**ప్రజాశక్తి-ముంచింగిపుట్టు:** మండలంలో సుజన కోట గ్రామ పంచాయతీ వానుగు పుట్టు గ్రామంలో ఆదివాసి సంక్షేమ పరిషత్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వంతల నాగేశ్వరరావు, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ డిస్ట్రిక్ట్ కమిటీ సభ్యులు జెండా లోహితల ఆధ్వర్యంలో ఆదివారం చట్టాల అమలుకు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆదివాసి సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వంతల నాగేశ్వరరావు మాట్లాడుతూ, 1/70 చట్టం, పీసా, మానవ సమాచార హక్కు చట్టం 2005, వినియోగదారుల చట్టం 2009 వంటి పటిష్టమైన చట్టాలపై గిరిజనులకు అవగాహన కల్పించారు. అనంతరం నూతన మండల కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ నూతన కమిటీ కార్యవర్గంలో గంపరాయి కోటేశ్వరరావు, తాంగుల జయరాం, గంపరాయి రమేష్ కుమార్, కిల్లో ఆనందరావు, కూడా మోహన్‌రావు, రెయ్యల నాగభూషణం, సీసా రామకృష్ణ, వంతల రాజబంధు, పెనుమాలి దుర్గాప్రసాద్ లు ఎన్నికయ్యారు.



ప్రచారం చేస్తున్న నాయకులు

# నక్కపల్లిలో బల్క్ డ్రగ్ పార్కు వద్దు

### సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అప్పలరాజు

**ప్రజాశక్తి -నక్కపల్లి:**నక్కపల్లి ప్రాంతంలో బల్క్ డ్రగ్ పార్కును ఏర్పాటు చేసి డంపింగ్ యార్డ్ గా మార్చొద్దని సిపిఎం జిల్లా కార్యదర్శి సభ్యులు ఎం.అప్పలరాజు తెలిపారు. మండలంలోని రాజయ్యపేటలో సిపిఎం ఆధ్వర్యంలో ఆదివారం గ్రామస్తులతో కలిసి సమావేశం నిర్వహించారు. బల్క్ డ్రగ్ యూనిట్ ఏర్పాటును వ్యతిరేకిస్తూ పెద్దపెట్టున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా అప్పలరాజు మాట్లాడుతూ, కాకినాడ జిల్లా ప్రజలు తిరస్కరించిన బల్క్ డ్రగ్స్ పార్కును రాష్ట్ర ప్రభుత్వం నక్కపల్లిలో ఏర్పాటు చేయాలని నిర్ణయించడం, దానిని కేంద్ర బీజేపీ ప్రభుత్వం ఆమోదించడాన్ని సిపిఎం తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. ఇప్పటికే ఈ ప్రాంతంలో ఉన్న హెటిరో డ్రగ్స్ కంపెనీతో నక్కపల్లి ప్రాంతం ప్రజలంతా వాయు, జల కాలుష్యంతో ఇబ్బందులు పడుతూ అనేక రకాల వ్యాధుల బారిన పడి ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. మత్స్యకారులు వేట సాగక ఉపాధి కోల్పోయి వలసలు పోతున్నారన్నారు. ఇవేమీ పట్టించుకోకుండా పరిశ్రమలు, అభివృద్ధి పేరుతో విదేశాల్లో నిషేదించిన, కాకినాడ జిల్లా ప్రజలు తిరస్కరించిన బల్క్ డ్రగ్ పార్కును నక్కపల్లి ప్రాంతంలో నెలకొల్పి ఈ ప్రాంతాన్ని డంపింగ్ యార్డ్ గా మార్చి ఇక్కడ ప్రజలు నివసించకుండా చేయాలని చూస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నక్కపల్లి లో బల్క్ డ్రగ్ యూనిట్ నెలకొల్పే ప్రతిపాదనలను విరమించు కోవాలని డిమాండ్ చేశారు. కాలుష్యానికి నష్టం లేకుండా, స్థానికులకు ఉద్యోగాలు, ఉపాధి కల్పించే పరిశ్రమలు నెలకొల్పడానికి ప్రభుత్వం పూను కోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి ఎం.రాజేష్, నాయకులు బి.రాము, కె.కాశీ, ఎం.నానాజీ, ఎం.జాన్ తదితరులు పాల్గొన్నారు.

## విరిగిపడుతున్న కొండచరియలు

### - పట్టించుకోని అధికారులు, నాయకులు

**ప్రజాశక్తి -కోటవురట్ల:**మండలంలో వరాహ నదీ పరివాహక ప్రాంతమైన ఇందేశమ్మ వాక పందూరు ఘాట్ రోడ్లపై కొండచరియలు విరిగి పడుతున్నా అధికారులు పట్టించుకోలేదు. కొండచరియలు విరిగి పడుతుండటంతో వాహనదారులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.స్వతంత్రం సిద్ధించిన తొలి నాళ్లల్లో నిర్మించిన ఈ రహదారి నేటికీ విస్తరణకు నోచుకోలేదు. ఏ క్షణాన ఏ ప్రమాదం ముంచుకు వస్తుందోనని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం ఉన్న రోడ్డు కొన్ని చోట్ల కుంగి పోవడంతో ట్రాఫిక్ సమస్య కూడా ఎదురవుతోంది. ఎన్నికల సమయంలో నాయకులు వాగ్దానాలు గుప్పిస్తున్నారే కానీ తదుపరి ఎవరు పట్టించుకోలేదని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు కొన్నిచోట్ల కొండ చరియలు విరిగిపడి రాళ్లు దొల్లు కొస్తున్నాయి. అధికారులు, నాయకులు ఇప్పటికైనా స్పందించి రహదారి విస్తరణకు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

## పూర్వ విద్యార్థుల కలయిక

**ప్రజాశక్తి-నక్కపల్లి:**1976-77 లో నక్కపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుకున్న పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు మండలంలోని ఉపమాక వెంకన్న సన్నిధిలో ఆదివారం కలుసుకున్నారు.ఉద్యోగ, వ్యాపార, రాజకీయాల్లో స్థిరపడిన వారంతా చాలాకాలం తర్వాత ఒకే వేదికపై కలుసుకోవడంతో వారి ఆనందానికి అవధులు లేకుండా పోయింది. చిన్ననాటి జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు.ఉదయం నుండి సాయంత్రం వరకు ఆలయ ప్రాంగణంలో గడిపి సందడి చేసారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ఎన్‌విఆర్ గోపాలచార్యులు, డివి రామారావు, నరిశే వెంకటాద్రి, నూకయ్య శెట్టి, ఎం రమణ, అబ్దుల్ అజీమ్, సత్యనారాయణ మదీనావల్లి, రాధిక తదితరులు పాల్గొన్నారు

## బాధితునికి రూ.80 వేల ఆర్థిక సాయం

**ప్రజాశక్తి -కొత్తకోట:** ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురైన నిరుపేద విద్యా వేత్త పడమటి శ్రీనివాసరావు కుటుంబానికి కొత్తకోటకు చెందిన కొత్తకోట ఎంప్లాయిస్ అసోసియేషన్ సభ్యులు (కెఈఏ) సుమారు రూ.80 వేల ఆర్థిక సాయం అందజేశారు. శ్రీనువాసరావు గత మూడు నెలల కిందట గ్రామంలో రోడ్డు ప్రమాదానికి గురై తీవ్రంగా గాయ పడ్డారు. అతని కుటుంబం నిరు పేద కుటుంబం కావడం తో పాటు తండ్రి వృద్ధుడు, తల్లి అనారోగ్యం తో మృతి చెందటం పలు సమస్యలతో ఉన్నాడు దీనిపై స్పందించిన పలువురు దాతలు ఆర్థికంగా ఆదుకున్నారు. ఈ నేపథ్యంలో ఎంప్లాయిస్ యూనియన్ సభ్యులు సుమారు రూ.80 వేల ఆర్థిక చేశారు. ఈ అసోసియేషన్ సభ్యుల సూచన మేరకు మరో దాత రూ.40 వేలు, మరొకరు రూ. 16,500 కూడా త్వరలోనే అందించే ఏర్పాటు చేస్తామని సభ్యులు వీరప్రకాష్ తెలిపారు. ఈ సందర్భంగా బాదితుడు శ్రీనివాసరావు మాట్లాడుతూ, తాను కష్టంలో ఉన్నానని గుర్తించి సహాయం అందించిన విద్యార్థులు, యువకులు, స్నేహితులు, మిత్రులకు కృతజ్ఞతలు తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో పలువురికి గాయాలు

**ప్రజాశక్తి- నక్కపల్లి:**మండలంలోని ఉద్దండ పురం జాతీయ రహదారిపై ఆదివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆటోను కారు ఢీకొనడంతో ఆటో డ్రైవర్ తో పాటు ఆటోలో ప్రయాణిస్తున్న పలువురు గాయపడ్డారు .స్థానిక సిహెచ్‌సిలో ప్రధమ చికిత్సను అందించారు. ఇదిలా ఉండగా ఎస్.రాయవరం మండలం రామయ్యపట్నంకు చెందిన నాని, ఏ.నాని కే.నాని ముగ్గురు కలిసి బైక్ పై తుని వెళుతూ చినరాంభద్రపురం హైవే జంక్షన్ వద్ద ఆగివున్న బైక్‌ను ఢీకొన్నారు .ఈ ప్రమాదంలో నలుగురు గాయపడడంతో హైవే పోలీసులు తుని ఏరియా ఆసుపత్రికి తరలించి వైద్యం అందించారు.

### సినీతార అనసూయ సందడి

**ప్రజాశక్తి - కలెక్టరేట్ :** నగరంలోని జగదాంబ జంక్షన్‌లో ఉన్న లక్కీ షాపింగ్ మాల్‌లో క్రిస్మస్, న్యూ ఇయర్, సంక్రాతి పండుగలను పురస్కరించుకొని ఫెస్టివల్ ఆఫర్స్ ప్రకటిస్తూ.. ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సినీ తార అనసూయ పాల్గొని సందడి చేశారు. ముందుగా నగర ప్రజలకు అభివాదం చేస్తూ ఆమె కాసేపు ముచ్చటించారు. షోరూం బయట ఏర్పాటు చేసిన స్టేజీపై స్టెప్పులు వేస్తూ అదరగొట్టారు. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ 12 ఏళ్లుగా విశాఖ ప్రజల మన్నలు పొందుతున్న లక్కీ షాపింగ్ మాల్ పండుగ సీజన్‌లో సరికొత్త ఆఫర్స్ తీసుకువచ్చిందన్నారు. షోరూమ్ అధినేతలు రత్తయ్య, శ్రీను, స్వామి పాల్గొన్నారు.


ప్రచారం నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే వంతల రాజేశ్వరి

## మోసకారి వైసిపికి బుద్ధి చెప్పాలి

**ప్రజాశక్తి -రంపచోడవరం :** గిరిజనులకు అన్ని విధాలా నష్టపోయిన వైసిపి ప్రభుత్వానికి గట్టి బుద్ధి చెప్పాలని టిడిపి మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇన్‌ఛార్జి వంతల రాజేశ్వరి అన్నారు. ఆదివారం మండలంలో పెదగెద్దాడ పంచాయతీ చిన్నగెద్దాడలో బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమంలో పాల్గొన్నారు. టిడిపి, జనసేన మిని మేనిఫెస్టోలోని పథకాలను వివరించారు.వైసిపి పాలనలో గిరిజనులకు జరిగిన అన్యాయంపై అవగాహన కల్పించారు కార్యక్రమంలో మండల అధ్యక్షులు కారం సురేష్‌బాబు, ప్రధాన కార్యదర్శి పెంటపాటి అనంతమోహన్, మాజీ సర్పంచ్ వై నిరంజన్‌దేవి, యూనిట్ ఇన్చార్జి కుంజం బాపన్నదొర, ధారా వెంకన్న, చందు, మడకం పండుదొర, కొసు నాగన్నదొర, బూత్ ఇన్చార్జి ముర్ల అన్నవరం, ముర్ల అనసూయ, ముర్ల సత్యవతి, ముర్ల మంగయ్యమ్మ, గుడిమెట్ల సావిత్రి, తుంబుడు రెడ్డమ్మ, చేదల సత్యవతి, చేదల పద్మ, ముర్ల విజయలక్ష్మి, సుప్పల వరలక్ష్మి, చింతలపూడి వెంకట వరలక్ష్మి, ముర్ల ధనలక్ష్మి, చెదల వెంకట సుబ్బలక్ష్మి, ముర్లా నాగలక్ష్మి పాల్గొన్నారు.

**కూనవరం** : మండలంలోని దూగుట్ట గిరిజన గ్రామంలో బాబు ష్యూరిటీ భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా రచ్చబండ నిర్వహించారు. అరకు పార్లమెంట్ తెలుగు యువత అధికార ప్రతినిధి గడేసుల రంజిత్ కుమార్ పాల్గొని టిడిపి, జనసేన ఉమ్మడి మేనిఫెస్టోలోని పథకాలను గిరిజనులకు వివరించి అవగాహన కల్పించారు. చంద్రబాబు హయాంలో చేపట్టిన పథకాలే నేటికీ గిరిజన ప్రాంతాల్లో ఉన్నాయని, వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత గిరిజనులకు అవస్థలే తప్ప, ఎటువంటి మేలు జరగలేదన్నారు. కార్యక్రమంలో తెలుగు యువత నాయకులు సొందే మహేష్, సోందే గాంధీ, గీగా రామారావు శ్రీను వార్డ్ మెంబర్ సాని పండు, చింతం సాయి, తెల్లం రాజేష్, తోండా శ్రీను, తెల్లం సురేష్, దగ్గుబెల్లి వినోద్, సాని రాజా రవీంద్ర, మేడి పండు, మేడి రాము, మేడి ప్రవీణ్ చింతం పోసి యాదవ్, బొల్లి యేసు, దూగుట్ట గ్రామస్థులు పాల్గొన్నారు.


కిటకిటలాడుతున్న పర్యాటక కేంద్రాలు

## పర్యాటక కేంద్రాలు కిటకిట

**ప్రజాశక్తి - రంపచోడవరం :** మండలంలోని పర్యాటక ప్రదేశాలు ఆదివారం సందర్శకులతో కిటకిటలాడాయి.కార్తీక మాసం ఆఖరివారం, ఆదివారం సెలవు దినం కావడంతో మైదాన ప్రాంతాల నుండి అధికసంఖ్యలో పర్యాటకులు ఉదయం నుంచే రంప, ఐ.పోలవరం పార్కులు రంప వాటర్ ఫాల్స్, పోలవరం పార్కు సమీపంలో జలపాతాల్లో స్నానాలు చేస్తూ ఆహ్లాదకరంగా గడిపారు.

## కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు

**ప్రజాశక్తి - కలెక్టరేట్ :** దక్షిణ నియోజవర్గంలో, ముఖ్యంగా 39వ వార్డు పరిధిలో ప్రభుత్వ, జివిఎంసి నిధులు కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు జరిగాయని 35వ వార్డు కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు అన్నారు. ఆదివారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.

# నేటి నుంచి లోకేష్ యువగళం

### సాయంత్రానికి పాయకరావుపేటకు రాక

**ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి**

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర సోమవారం సాయంత్రానికి జిల్లాలో ప్రవేశించనుంది. తుని నుంచి సాయంత్రం 5.30 గంటలకు జిల్లాలోని పాయకరావుపేట నియోజకవర్గంలోకి లోకేష్ రానున్నారు. ఈ సందర్భంగా భారీ ఎత్తున స్వాగతం పలికేందుకు కార్యకర్తలను సమీకరిస్తున్నారు. నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే, టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యురాలు వంగలపూడి అనిత యువగళం విజయవంతానికి పార్టీ శ్రేణులను సమాయత్తపరిచారు. సోమవారం నుంచి బుధవారం ఉదయం 11.25 గంటల వరకు పాయకరావుపేట నియోజకవర్గంలో లోకేష్ పాదయాత్ర కొనసాగనుంది. సోమవారం సాయంత్రం పిఎల్.పురం, సీతారామపురం, నామవరంలో పర్యటించనున్నారు. నామవరంలో రాత్రి బసచేసి, మంగళవారం ఉదయం 8 గంటలకు పాదయాత్ర ప్రారంభిస్తారు. పలు గ్రామాల మీదుగా సాయంత్రం 7.50 గంటలకు క్రిషి గోకులం వుడా లేఅవుట్‌కు చేరుకొని అక్కడ రాత్రి బస చేయనున్నారు. బుధవారం ఉదయం 8 గంటలకు బయలుదేరి పెనుగొల్లు మీదుగా ఉదయం 11.25 గంటలకు యలమంచిలి నియోజకవర్గానికి చేరుకుంటారు. పాయకరావుపేట నియోజకవర్గంలో స్థానికులు, యువత, బిసిలు, కాపులు, మహిళలు, డ్వాక్రా, కేబుల్ ఆపరేటర్లు, రేషన్ డీలర్లు, మత్స్యకారులు, సుగర్ ఫ్యాక్టరీ ఉద్యోగులు, రైతులతో మాట్లాడనున్నారు.

యలమంచిలి నుంచి అనకాపల్లి నియోజకవర్గం మీదుగా గాజువాక నియోజకవర్గంలోకి ప్రవేశించనున్నారు. గ్రామీణ ప్రాంతంలోని ఉమ్మడి విశాఖపట్నం జిల్లా పరిధి అరకు, పాడేరు, వి.మాడుగుల, చోడవరం, నర్సీపట్నం నియోజకవర్గాల పార్టీ కార్యకర్తలను సమీప పాదయాత్ర ప్రాంతాలకు తీసుకురానున్నారు. యువగళం పాదయాత్రకు మధ్యలో కొన్ని రోజులు విరామం రావడంతో గ్రామీణ ప్రాంతంలో పాదయాత్ర చేపట్టడానికి సమయం సరిపోదని జాతీయ రహదారికి అనుకొనివున్న నియోజకవర్గాల గుండా పాదయాత్రకు ప్రణాళిక రచించారు. యాత్ర సాగిన ప్రతి నియోజకవర్గం సమీపంలోని గ్రామాల నుంచి కార్యకర్తలను తరలించి భారీ ఎత్తున ఎక్కడికక్కడ స్వాగతం పలికేలా ఏర్పాట్లు చేశారు. పాదయాత్ర సాగిన ప్రాంతాల్లో భారీ ఎత్తున ఫ్లెకీలు ఏర్పాటు చేశారు. కూడళ్లలోనూ, దారిపొడవునా జెండాలు కట్టారు.

#### ముగింపు సభ ఏర్పాట్లపై సమీక్ష

**విశాఖ కలెక్టరేట్ :** నారా లోకేష్ చేపట్టిన యువ గళం పాదయాత్ర విశాఖపట్నం జిల్లాలో ముగుస్తున్న సందర్భంగా చేయాల్సిన ఏర్పాట్లపై ఆదివారం నగరంలోని ఓ హోటల్‌లో పార్టీ జోన్ వన్ ఇన్‌ఛార్జి దామచర్ల సత్య ఆధ్వర్యంలో సమీక్ష జరిపారు. పార్టీ జిల్లా అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి, తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు, మాజీ ఎమ్మెల్యే, పార్టీ దక్షిణ ఇన్‌ఛార్జి గండి బాబ్జీ, జిల్లా ప్రధాన కార్యదర్శి పాశర్ల ప్రసాద్, భీమిలి నియోజకవర్గం ఇన్‌ఛార్జి కోరాడ రాజబాబు, మాజీ కార్పొరేటర్ ఆళ్ళ శ్రీనివాసరావు, భాష్యం ప్రవీణ్ పాల్గొన్నారు.

# విశాఖ బాలోత్సవానికి వాలంటీర్లు సన్నద్ధం

**ప్రజాశక్తి - కలెక్టరేట్ :** విశాఖ బాలోత్సవం ఈ నెల 14, 15, 16 తేదీలలో సెయింట్ ఆంథోనీ తెలుగు మీడియం పాఠశాలలో జరుగనుందని, ఇప్పటికే వాలంటీర్లు అందుకు పూర్తి సన్నద్ధతతో ఉన్నారని బాలోత్సవం ప్రధాన కార్యదర్శి జిఎస్.రాజేశ్వరరావు తెలిపారు. వేలాది మంది విద్యార్థులు పాల్గొనే ఈ పిల్లల పండగ నిర్వహణ కోసం ఆదివారం అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో వాలంటీర్ల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రోజూ 27 ఈవెంట్స్ జరుగుతాయని, దాదాపుగా 100 మంది వాలంటీర్లు ఈ కార్యక్రమం నిర్వహణకు అవసరం ఉంటుందని అన్నారు. యువతలో సేవాభావం పెంపొందించేందుకు ఇది చాలా మంచి అవకాశమన్నారు. ఇంటర్ పైబడిన వారు వాలంటీరుగా సేవలు అందించేందుకు రావొచ్చునని తెలిపారు. తలిదండ్రులు పిల్లలను ప్రోత్సహించి వాలంటీర్లుగా పంపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వాలంటీర్లుగా రావాలనుకునే వారు 9550356471 ఫోన్ నెంబర్‌ను సంప్రదించాలన్నారు. బాలోత్సవం నిర్వహణ కమిటీలు ఇప్పటికే వేశామన్నారు. వాలంటీర్ల కో - ఆర్డినేటర్‌గా ఎమ్.గుణ శంకర్, సభ్యులుగా హరిత, ఉమా శైలజ, ఉషా, రోషన్, ఆర్.నిఖిల్, జాహ్నవి, అజయ్, సంధ్య, మీనాక్షి, సాయి తేజ, అలేఖ్య ఉన్నారని తెలిపారు. సమావేశంలో బాలోత్సవం అధ్యక్షులు పి.రఘు, ఉపాధ్యక్షులు కె.రమాప్రభ, ఎల్లాజీ, సరోజినీదేవి, ప్రీతి పాల్గొన్నారు.

# వన్ వే ప్రత్యేక రైళ్లు ఏర్పాటు


**ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ :** ప్రయాణికుల అదనపు రద్దీని నివారించేందుకు రంగపర-సికింద్రాబాద్, పూరీ-అహ్మదాబాద్ మధ్య వన్ వే ప్రత్యేక రైళ్లను నడపాలని రైల్వే నిర్ణయించింది. ఈ మేరకు రైలు నెంబరు 02605 రంగపర నార్త్ - సికింద్రాబాద్ వన్ వే స్పెషల్ ఎక్స్‌ప్రెస్ రైలు డిసెంబర్ 17 ఆదివారం సాయంత్రం 6:00 గంటలకు రంగపర నార్త్‌లో బయలుదేరుతుంది. మంగళవారం తెల్లవారుజామున 2.00 గంటలకు విశాఖపట్నం చేరుకుని 2.20 గంటలకు బయలుదేరి అదేరోజు సాయంత్రం 16.30 గంటలకు సికింద్రాబాద్ వెళ్తుంది. ఈ రైలు ఉడల్‌గురి, రంగియా, బార్‌పేట రోడ్, న్యూ బొంగైగావ్, కోక్రాఝర్, న్యూ కూచ్‌బెహార్, న్యూ జల్పైగురి, కిషన్‌గంజ్, మాల్దా టౌన్, రాంపూర్‌హాట్, బర్ధమాన్, దంకుని, ఖరగ్‌పూర్, కటక్, భువనేశ్వర్, ఖుర్దాక్ రోడ్, బ్రహ్మపూర్, బ్రహ్మపట్నం, రాజమండ్రి, ఏలూరు, విజయవాడ, గుంటూరు, నల్గొండ మీదుగా ప్రయాణిస్తుంది.

08419 పూరీ - అహ్మదాబాద్ వన్ వే స్పెషల్ ఎక్స్‌ప్రెస్ రైలు డిసెంబర్ 11 సోమవారం ఉదయం 9.50 గంటలకు పూరి నుంచి బయలుదేరి సాయంత్రం 17.15 గంటలకు విశాఖపట్నం చేరుకుని మరలా 17.35 గంటలకు బయలుదేరి బుధవారం అర్ధరాత్రి 1.30 గంటలకు అహ్మదాబాద్ వెళ్తుంది. ఈ ప్రత్యేక రైలు ఖుర్దా రోడ్, బాలుగావ్, ఛత్రపూర్, బ్రహ్మపూర్, పలాస, శ్రీకాకుళం రోడ్, విజయనగరం, విశాఖపట్నం, దువ్వాడ, అనకాపల్లి, సామర్లకోట, రాజమండ్రి, ఏలూరు, విజయవాడ, వరంగల్, రామగుండం, మంచిర్యాల, సిర్పూర్ కాగజ్‌నగర్‌లో ఆగుతుంది.


రోగులను పరీక్షిస్తున్న వైద్యాధికారి

## 300 మందికి ఉచిత వైద్య సేవలు

**ప్రజాశక్తి -రంపచోడవరం :** రాజమండ్రిలోని రామకృష్ణ మిషన్ గిరిజన సంచార వైద్యశాల ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ప్రత్యేక వైద్య శిబిరానికి విశేష స్పందన వచ్చిందని మిషన్ కార్యదర్శి స్వామి పరిజ్ఞేయనందజీ మహారాజ్ తెలిపారు. వైద్య శిబిరంలో రామకృష్ణ మిషన్ మేనేజర్ స్వామీ రఘువీరనంద మహరాజ్ పాల్గొని సేవలను పరిశీలించారు. డాక్టర్ గోలి వెంకట రామారావు డాక్టర్ కస్తూరి సుబ్రమణ్యం, డాక్టర్ శ్రీకృష్ణ పాతూరి, డాక్టర్ టి.వి.సుబ్బారావు, డాక్టర్ రాయుడు శ్రీనివాస్ డాక్టర్ ఎస్. సంపత్ కుమార్, జి.యస్. ఎల్.డాక్టర్స్ పాల్గొని సుమారు 300మందికి వైద్య సేవలు అందించారు. 82 మందికి రక్తపరీక్షలు, 14.మందికి థైరాయిడ్ పరీక్షలు ఏనిమిది మందికి ఇసిజిలు, 22మందికి ఎక్స్‌రేలు, ఇద్దరికి ఫిజియోథెరపీ చేసినట్లు తెలిపారు. వేమగిరి పరమహంస యోగానంద కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో 45మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. వీరిలో పదిమంది దృష్టిలోపం ఉన్నవారిని గుర్తించి కళ్లద్దాలు పంపిణీ చేశారు. ఏడుగురికి కంటి ఆపరేషన్లకు ఎంపికచేసి, వేమగిరి పరమహంస యోగానంద కంటి ఆసుపత్రికి తరలించారు. రామకృష్ణ మిషన్ అందిస్తున్న వైద్య సేవలను గిరిజనులను సద్వినియోగం చేసుకోవాలని, స్వామీజీ కోరారు. వైద్య శిబిరంలో క్యాంప్ కోఆర్డినేటర్ కానుమోను శ్రీనివాస్, వాలంటీర్స్ ఎల్.జిబి.భగిరథ రాజు, ఉదయ్ కిరణ్, మంగి రెడ్డి, రామచంద్రం సిబ్బంది పాల్గొన్నారు, శిబిరానికి వచ్చిన రోగులు, సహాయకులను భోజన సదుపాయం కల్పించారు.



వాహన తనిఖీలు నిర్వహిస్తున్న సిఐ వెంకటేశ్వరరావు

## పోలీసుల ముమ్మర వాహన తనిఖీలు

**ప్రజాశక్తి - రంపచోడవరం :** ఎఎస్‌పి జగదీష్ అడహళ్లి పర్యవేక్షణలో, రంపచోడవరం సిఐ వాసా వెంకటేశ్వరరావు ఎస్ఐ మోహన్‌కుమార్ ఆధ్వర్యంలో ఆదివారం పోలీస్ స్టేషన్ ఎదుట వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలలో డ్రంకెన్ డ్రైవ్, వాహన లైసెన్సులు, రికార్డ్స్ లేని వాహనాలను అడ్డుకుని వాటిని స్వాధీనం చేసుకున్నారు. మద్యం మత్తులో వాహనాలు నడిపిన వారిపై కేసులు నమోదు చేశారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

### అలరించిన స్వరమాలిక

**ప్రజాశక్తి - కలెక్టరేట్ :** వేదం అనువణువున నాదం అనే శీర్షికన ఆదివారం సాయంత్రం అల్లూరి విజ్ఞాన కేంద్రంలో 'స్వరమాలిక' పేరిట నిర్వహించిన సినీ సంగీత విభావరి అలరించింది. కళారంగ ప్రముఖులు సన్ మూర్తి, ఎంవి.రాజశేఖర్, భయ్యా శ్రీనివాస్, వెంకటేష్ పట్టెం, రాజపాత్రుడు తదితరులు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. గాయకులు ఆంజనేయ రెడ్డి స్వర నిర్వహణలో నగరానికి చెందిన గాయనీ గాయకులు జ్యోతి, ఆంజనేయులు, నరసింహమూర్తి, వెంకట్, సురేష్ కన్నా, లావణ్య, కళ్యాణి, శైలజ తదితరులు ఉషారైన గీతాలతో అలరించారు.